క్లుప్తంగా

ఉపాధి హామీ పనులపై సమీక్ష

గుడ్లూరు: మండలంలో గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులపై టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఏపీఓ అబ్దుల్లా బుధవారం స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలు ఉదయం ఆరు గంటలకే పని ప్రదేశాలకు చేరుకుని 10 గంటల వరకు పనులు చేయాలన్నారు. కూలీలకు ఇబ్బంది కలగకుండా పని ప్రదేశాలలో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని ఫీల్డు అసిస్టెంట్లకు సూచించారు. ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేసుకుంటే కూలీలకు రోజుకు రూ.300 కూలి నగదు పడుతుందన్నారు. మస్టర్లలో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా చూడాలన్నారు. పని ప్రదేశాలలో జరుగుతున్న పనులను టెక్నికల్ అసిస్టెంట్లు ప్రతిరోజూ పర్యవేక్షణ చేయాలన్నారు. ఉద్యానవన పంటలను ఎక్కువగా సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించారు.

కోడి పందెం రాయుళ్ల అరెస్ట్



కోడి పందెం నిర్వాహకులతో ఎస్సై, సిబ్బంది

వలేటివారిపాలెం: మండంలోని కూనిపాలెం బస్టాండ్‌లోని జంక్షన్ దగ్గర్లో గల పొలాల్లో కొంత మంది వ్యక్తులు కోడి పందేలు ఆడుతున్నారని సమాచారం రావడంతో వలేటివారిపాలెం ఎస్సై బి.నాయక్ తన సిబ్బందితో బుధవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి మూడు కోళ్లను, రూ.58,760 నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి వారిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్సై నాయక్ తెలిపారు.

దర్శిలో ఓ మోస్తరు వర్షం

దర్శి: దర్శిలో ఓ మోస్తరు వర్షం కురిసింది. సాయంత్రం ఐదు గంటల నుంచి సుమారు గంట పాటు కురిసిన వర్షానికి పొలాలు పదునయ్యే అవకాశం ఉంది. అక్కడక్కడా ఉరుములు మెరుపులులతో కూడిన వర్షంతో పాటు పిడుగులు పడిన శబ్దాలు వచ్చాయి. వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న ఉభయదాతలు

పొదిలి: స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. యల్లటూరి అంకమరావు, వెంకట రమణ దంపతుల ఆధ్వర్యంలో బుధవారం అన్నదానం చేశారు. ముందుగా ఆలయంలో అర్చకుడు మురళీచార్యుల ఆధ్వర్యంలో దంపతులు పూజలు నిర్వహించారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



టంగుటూరులో చదవడం మాకిష్టం కార్యక్రమంలో విద్యార్థులు



పరుగుపందెంలో పాల్గొన్న విద్యార్థులు



గుడ్లూరు గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

కొండపి(సింగరాయకొండ): వేసవి శిక్షణలో భాగంగా గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కొండపి గ్రంథపాలకుడు బి.కోటేశ్వరరావు కోరారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు జూనియర్స్, సీనియర్స్ విభాగంలో తాడాట, రింగ్ లెగ్స్ తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. విద్యార్థులతో పుస్తకాలు చదివించడంతోపాటు కథలు వివరించారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. శిక్షణలో 16 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

టంగుటూరు: పిల్లలు పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని గ్రంథాలయ నిర్వాహకుడు జి.వర్ధనరాజు పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయంలో బుధవారం వేసవి విజ్ఞాన కేంద్రంలో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్ధనరాజు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించే కార్యక్రమాలు చేపడుతున్నామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు పరుగు పోటీలు

ఉలవపాడు: ఉలవపాడులోని శాఖా గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు పరుగుపందెం నిర్వహించారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా గ్రంథాలయ ఆవరణలో ఈ పోటీలు జరిగాయి. 100 మీటర్ల పరుగుపందెం ఏర్పాటు చేయగా, మొత్తం 51 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ముందుగా విద్యార్థులతో నీతికథలు, మహనీయుల చరిత్రలు చదివించారు. స్థానిక గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. గత పదిరోజుల నుంచి జరిగిన పోటీల్లో విజేతలకు ఈ నెల 7వ తేదీ బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

గుడ్లూరు: స్థానిక ఎర్రన గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకుడు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. వేసవి శిక్షణ కార్యక్రమాలలో భాగంగా బుధవారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఆటలు ఆడటం ద్వారా శారీరక, మానసిక వికాసం కలుగుతుందన్నారు. నీతి కథలు చదవడం ద్వారా విద్యార్థులు సమాజంలో మంచి పౌరులుగా ఎదుగుతారన్నారు. 15 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారన్నారు. అనంతరం విద్యార్థులకు పుస్తక పఠనం, యోగా, ఆరోగ్య సూత్రాల గురించి వివరించారు.

జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినుల సత్తా



విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కనిగిరి రూరల్: నేషనల్ మీన్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షల్లో కనిగిరి జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటినట్లు ప్రధానోపాధ్యాయురాలు కలవ విజయలక్ష్మి తెలిపారు. పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థినులు రుచితశ్రీ, జస్మితారెడ్డి, ఎస్‌డీ ఆక్సా, పి.సింధుప్రియ, వై జెస్సీ, కె.ఆక్సా, సబియా జులేహాలు ఎన్ఎంఎంఎస్ ప్రతిభా పురస్కారానికి ఎంపికయ్యారు. వీరికి ఏటా రూ.12 వేల చొప్పున నాలుగేళ్ల పాటు స్కాలర్‌షిప్ అందచేస్తారని తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థినులను బుధవారం పాఠశాల హెచ్‌ఎం కె.విజయలక్ష్మితో పాటు, ఉపాధ్యాయులు బట్టు శైలజారాణి, రమణారెడ్డి, పాశం సుశీల, రమాదేవి, పేరెంట్స్ కమిటీ సభ్యులు వనమా వెంకటేశ్వర్లు, నల్లగట్ల సునీత తదితరులు అభినందించారు.

19 మంది దివ్యాంగుల గుర్తింపు



దివ్యాంగుల సర్వేలో పాల్గొన్న ఎంఈఓ రమణయ్య

హనుమంతునిపాడు: మండలంలో ఇప్పటి వరకు 19 మంది దివ్యాంగులను గుర్తించినట్లు ఎంఈఓ ఎస్.రమణయ్య అన్నారు. హనుమంతునిపాడు పంచాయతీ పరిధిలో బుధవారం దివ్యాంగుల గుర్తింపు సర్వే నిర్వహించారు. సర్వేలో ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల సర్వే పారదర్శకంగా నిర్వహించాలని భవిత పాఠశాల టీచర్లకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల్లో వివిధ లోపాలున్న వారిని గుర్తించి భవిత పాఠశాలల్లో చేర్పించాలన్నారు. బడిబయట పిల్లలను గుర్తించాలన్నారు. భవిత పాఠశాలల్లో విద్యతో పాటు అన్ని మౌలిక సదుపాయాలతో పాటు నాణ్యమైన విద్యా బోధన అందిస్తారన్నారు. దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీ టీచర్లు కొత్తపల్లి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఉపకార వేతనానికి ఎంపిక



భానుప్రకాష్‌రెడ్డి



శ్రీకన్య

ఉలవపాడు: మండలంలోని కరేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు జాతీయ ఉపకార వేతనం (ఎన్ఎంఎంఎస్)కు ఎంపికై నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పన్నూరు శ్రీనివాసులు బుధవారం తెలిపారు. గత సంవత్సరం డిసెంబర్‌లో జరిగిన జాతీయ ఉపకార వేతన పరీక్షలో పాఠశాలకు చెందిన ఆసోది భానుప్రకాష్‌రెడ్డి, కటారి శ్రీకన్య ప్రతిభ చూపి జాతీయ ఉపకారవేతనాలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరికి సంవత్సరానికి రూ.12 వేల చొప్పున నాలుగు సంవత్సరాల పాటు జాతీయ విద్యామంత్రిత్వ శాఖ ద్వారా ఉపకారవేతనం అందుతుందని చెప్పారు. పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఉపకార వేతనానికి ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం, ఉపాధ్యాయులు, సిబ్బంది, పాఠశాల కమిటీ చైర్మన్ బొద్దు శ్రీధర్‌రెడ్డి, గ్రామస్తులు అభినందించారు.

70 మందికి వైద్య పరీక్షలు



సీతారాంపురంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సందీప్

హనుమంతునిపాడు: మండల పరిధిలోని సీతారాంపురంలో ఇంటింటికి ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరంలో భాగంగా 70 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వ్యాధి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 70 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. గర్భిణులు, బాలింతలను పరీక్షించి మందులు అందజేశారు. వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మండలంలో భారీ వర్షం

సీఎస్‌పురం(పామూరు): మండల కేంద్రమైన సీఎస్‌పురంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. భారీవర్షం నిమ్మ, బత్తాయి రైతులకు ఊరటనిచ్చింది. అదేవిధంగా వాగుల్లోని గుంతలకు, పొలాలు, అటవీప్రాంతంలోని గుంతలకు నీరు చేరుతుండటంతో పశుపోషకులు, జీవాల పెంపుదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బూచేపల్లిని కలిసిన మండల నాయకులు



బూచేపల్లిని సన్మానిస్తున్న పామూరు నాయకులు

పామూరు: దర్శి ఎమ్మెల్యేగా గెలుపొందిన డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని బుధవారం సాయంత్రం వైఎస్సార్ సీపీ మండల నాయకులు, రెడ్డి సంక్షేమ సంఘ నాయకులు కోటపాటి రవికుమార్‌రెడ్డి, పలువురు ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను ఘనంగా సన్మానించారు.

తాటిపర్తికి పలువురు శుభాకాంక్షలు



తాటిపర్తికి అభినందనలు తెలియజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సింగరాయకొండ: యర్రగొండపాలెం ఎమ్మెల్యేగా గెలుపొంది మొదటిసారిగా స్వగ్రామానికి వచ్చిన తాటిపర్తిని పలువురు నాయకులు బుధవారం కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ పటేల్, షేక్ కరీం, పాలపర్తి శ్రీనివాసరావు, పి.శ్రీనివాసుల రెడ్డి, 108 డ్రైవర్ షేక్ మస్తాన్, షేక్ నౌషాద్, షేక్ అల్లాభక్షు, సవళం కోటేశ్వరరావు, తాటిపర్తి ప్రనయ్, షేక్ జానీబాషా, షేక్ సుల్తాన్, షేక్ మహమద్, పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, షేక్ మాబాషా, షేక్ అబ్దుల్లా, షేక్ షానుబాషా, షేక్ జావీద్, షేక్ ముజీబ్, షేక్ఇంతియాజ్, షేక్ మెహర్‌బాషా, షేక్ అల్లాఉద్దీన్, రాయిపేర్రాజు తదితరులు పాల్గొన్నారు.

చినారికట్లలో మోస్తరు వర్షం



చినారికట్ల జంక్షన్‌లో వర్షం

కొనకనమిట్ల: ఆవర్తన ప్రభావంతో బుధవారం సాయంత్రం కొనకనమిట్ల మండలంలోని చినారికట్ల, బచ్చలకూరపాడు, గొట్లగట్టు, పాతపాడు గ్రామాల్లో మోస్తరు వర్షం పడింది. వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఉపశమనం పొందారు. పొలాలు పదునెక్కడంతో వేసవి దుక్కులు దున్నుకునేందుకు అనువుగా ఉంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు 38 మంది ఎంపిక

కురిచేడు: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌నకు మండలం నుంచి 30 మంది ఎంపికైనట్లు వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీఎస్ఆర్ సాయి తెలిపారు. వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 8 మంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బోధనంపాడు నుంచి 14 మంది, పొట్లపాడు నుంచి 9 మంది, కల్లూరు నుంచి 2, దేకనకొండ నుంచి 3, ఎంపీయూపీఎస్ పడమర వీరాయపాలెం నుంచి ఇద్దరు ఎంపికయ్యారని పేర్కొన్నారు. జిల్లా 2వ ర్యాంకు దేకనకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్. శ్రావణి, 4వ ర్యాంకును పొట్లపాడు పాఠశాల, 6, 9 ర్యాంకులను బోధనంపాడు పాఠశాల విద్యార్థినులు శిరిషా, ప్రవల్లికలు సాధించినట్లు ఆయన వివరించారు.

పాఠ్యపుస్తకాలు వచ్చాయ్!

- ప్రభుత్వ పాఠశాలల పునఃప్రారంభం రోజే విద్యార్థులకు అందచేత
- కొమరోలు మండలంలో 4,220 మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు



పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ వెంకటరత్నం

కొమరోలు : విద్యాసంవత్సరం పునఃప్రారంభమై విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం విద్యాశాఖ అధికారులు పుస్తకాలు జిల్లా కేంద్రాల నుంచి మండల కేంద్రాల్లోని ఎమ్మార్సీ కార్యాలయాలకు పంపించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యార్థులకు సకాలంలో పాఠ్యపుస్తకాలు అందించే విధంగా చర్యలు చేపట్టింది. పాఠశాలలు ప్రారంభం కావడానికి మరో పది రోజులు ఉండగానే పాఠ్యపుస్తకాలు మండల కేంద్రాలకు చేరుకున్నాయి. కొమరోలు మండలంలో మొత్తం 63 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు ఉండగా ఎంపీపీ పాఠశాలలు 44, ప్రాథమికోన్నత పాఠశాలలు 3, ఉన్నత పాఠశాలలు 4, కెజీబీవి 1, ఎయిడెడ్ పాఠశాలలు 11 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో మొత్తం 4220 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి యేటా ఉచితంగా పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తోంది.

1 నుండి 10 వరకు సెమిస్టర్ విధానం

1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు సెమిస్టర్ 1, సెమిస్టర్ 2గా విభజించి పాఠ్యపుస్తకాలను సరఫరా చేస్తున్నారు. మండలంలో తరగతుల వారిగా విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు వేసవి సెలవులు ముగిసే లోపు మండల కేంద్రాలకు చేరాయి. పాఠశాలల పునఃప్రారంభం రోజున విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందచేసే విధంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

త్వరలోనే పాఠశాలలకు పుస్తకాల పంపిణీ:

జిల్లా కేంద్రం నుంచి ఎమ్మార్సీకి పాఠ్యపుస్తకాలు వారం రోజుల క్రితమే వచ్చాయి. ఈ పాఠ్యపుస్తకాలను ఆయా పాఠశాలలకు పంపిణీ చేసేందుకు సిద్ధమవుతున్నాం. పాఠశాలలు పునఃప్రారంభం జూన్ 12వ తేదీన విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తాం. దానికి అనుగుణంగా ప్రణాళిక రచించి పాఠ్యపుస్తకాలు సరఫరా చేస్తున్నాం.



బి.వెంకటరత్నం, ఎంఇఒ, కొమరోలు మండలం

విద్యార్థులకు డ్యాన్స్‌పై అవగాహన

పెద్దదోర్నాల: వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు యోగా, డ్యాన్స్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యోగాతో కలిగే ప్రయోజనాలు వివరించారు. గ్రంథపాలకుడు సుబ్బారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దారవీడు: వేసవి శిక్షణ తరగతులు విద్యార్థుల్లో ఉత్సాహం, ఆలోచనా శక్తితో పాటు సృజనాత్మకత పెంపొందిస్తాయని ఎంఈఓ పి.శ్రీనివాసులు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం గ్రంథపాలకుడు ఏర్వ వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ గ్రంథాలయంలోని విలువైన పుస్తకాలను చదివితే విద్యార్థులకు ప్రముఖుల జీవిత చరిత్ర స్ఫూర్తి దాయకంగా నిలుస్తుందని తెలిపారు. క్విజ్ పోటీలతో విద్యార్థుల్లో ఆలోచనా శక్తి పెంపొందుతుందని, చిన్న నాటి నుంచే దేశభక్తి, నైతిక విలువలు పెంపొందించేలా ఉంటుందన్నారు. పుస్తకాలు మంచి నేస్తాలని, పుస్తక పఠనంతో మనోవికాసం కలుగుతుందని, చదువుతో పాటు ఆటల్లో కూడా రాణించాలని, చిన్నారులు విజ్ఞానంతో కూడిన ఆటలు ఆడాలన్నారు. క్రమం తప్పకుండా గ్రంథాలయానికి వచ్చి న్యూస్ పేపర్ చదివితే ప్రపంచంలో జరిగే విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని చెప్పారు. క్రీడలతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. అనంతరం ఆటలు, పాటలు, డ్యాన్స్, చెస్, క్యారమ్స్, కోలాటం తదితర పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అల్లు మనోహరరెడ్డి, గొట్టం చిన్న సత్యనారాయణ రెడ్డి, తిరుమలరెడ్డి నారాయణరెడ్డి, 38 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



డ్యాన్స్, యోగాపై అవగాహన కల్పిస్తున్న గ్రంథపాలకుడు

7న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం

కనిగిరి రూరల్: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల, నాయకులు, ప్రజాప్రతినిధుల సమావేశం ఈ నెల 7న శుక్రవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు పార్టీ కార్యాలయ ప్రతినిధి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి పార్టీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ హాజరవుతారన్నారు. ఆరు మండలాల పార్టీ శ్రేణులంతా హాజరుకావాలని పిలుపునిచ్చారు.

చెస్‌తో విద్యార్థుల్లో మేధో వికాసం

మార్కాపురం: చెస్ ఆడటంతోపాటు పుస్తక పఠనం చేయడం వల్ల విద్యార్థుల్లో మేధస్సు పెరుగుతుందని గ్రంథపాలకుడు జీవీ శివారెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో 19వ రోజు వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులతో కథలు చెప్పించడం, పుస్తకాలు చదివించడం, బ్రెయిన్ గేమ్స్ ఆడించారు. హాజరైన విద్యార్థులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేసినట్లు లైబ్రేరియన్ తెలిపారు.

గ్రంథాలయంలో స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు

బేస్తవారిపేట: స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులను బుధవారం గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉపాధ్యాయుడు పీవీ గురుస్వామి విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, ఇంగ్లిష్ గ్రామర్, కథలు చెప్పడం, వినిపించడం, చెస్, క్యారమ్స్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. 29 మంది విద్యార్థులు వేసవి విజ్ఞాన శిబిరానికి హాజరైనట్లు గ్రంథపాలకుడు తెలిపారు.